## క్లుప్తంగా

### ఇస్కాన్‌లో మార్మోగిన హరినామస్మరణ



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

**కొమ్మాది:** హరే కృష్ణ, హరే రామ నామస్మరణతో సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరం ఆదివారం మార్మోగింది. వారాంతపు పూజల సందర్భంగా ఇస్కాన్ అధ్యక్షుడు సాంబదాస్ ప్రభూజీ, మాతాజీ నితాయి సేవిని భగవద్గీత శ్లోకాలను ఆలపించారు. రాధాకృష్ణులను పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

### అలరించిన 'శ్రీకృష్ణలీలలు'

**తగరపువలస:** గంభీరం ఐఐఎంవీ రోడ్డులోని హరేకృష్ణ వైకుంఠంలో శ్రీరాధా మదన్ మోహన్ మందిరంలో ఆదివారం జరిగిన శ్రీకృష్ణ అర్పణం కార్యక్రమంలో భాగంగా నగరానికి చెందిన జిల్లా భవన్ విద్యార్థులు శ్రీకృష్ణ లీలలపై నృత్యరూపకం ప్రదర్శించారు. తాళ్లప్రగడ లలిత శ్రీనివాస్ ఆధ్వర్యంలో చిన్నారులు డి.రిషిత, టి.నమస్య, నాగవర్షిణి, రోషిణి ప్రదర్శన ఆకట్టుకుంది. హరేకృష్ణ మూమెంట్ అధ్యక్షుడు నిష్కించన భక్తదాస వీరిని అభినందించారు. ప్రతి ఆదివారం నిర్వహించే ఈ కార్యక్రమంలో పాల్గొనాలనుకునేవారు 95425 11108లో సంప్రదించాలని అంబరీష దాస కోరారు.

### రాష్ట్ర స్థాయి విలువిద్య పోటీలకు ఎంపిక



కె.జోషిత

**తగరపువలస:** ఆనందపురం మండలం గుడిలోవ విజ్ఞాన్ విహారలో 8వ తరగతి చదువుతున్న కె.జోషిత రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–14 బాలికల పోటీలకు ఎంపికైంది. ఉమ్మడి విశాఖకు చెందిన అరకు వ్యాలీ స్పోర్ట్స్ స్కూల్ వేదికగా బాలురు, బాలికల విలువిద్య పోటీలకు ఇటీవల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచి, రాష్ట్రస్థాయికి ఎంపికైన జోషితను ప్రధాన ఆచార్యురాలు డీవీఎల్ సావిత్రి, విజ్ఞాన విహార కమిటీ సభ్యుడు బాలి రవి అభినందించారు.

### దశ ఇంద్రియాలను జయించడమే దసరా పండగ

**పద్మనాభం:** ఐదు కర్మేంద్రియాలు, ఐదు జ్ఞానేంద్రియాలను యోగ మార్గంలో నశింపజేయడం అంటే మొత్తం ఇంద్రియాలను జయించడమే దసరా పండగ అని ఇందూ జ్ఞాన వేదిక విజయరాంపురం కమిటీ సభ్యులు తెలిపారు. దశ అంటే పది అని, ర అంటే నశింపజేయడం అని వివరించారు. మండలంలోని తునివలస, నరసాపురం గ్రామాల్లో ఆదివారం త్రైతసిద్ధాంత భగవద్గీత, దసరా ప్రాముఖ్యతల గురించి వారు ప్రచారం చేశారు. కార్యక్రమంలో విజయరాంపురం కమిటీ అధ్యక్షుడు కె.త్రినాథరావు, సభ్యులు పాల్గొన్నారు.

### రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు మధురవాడ క్రీడాకారులు



క్రీడాకారులను అభినందిస్తున్న కోచ్‌లు

**మధురవాడ:** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు మధురవాడకు చెందిన ఇద్దరు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఎ.భాగ్యశ్రీ అండర్–17 విభాగంలో, కె.తోషన్ అండర్–14లో ఎంపికయ్యారు. ఇద్దరూ కొమ్మాది, పీఎం పాలెంలోని ప్రైవేట్ స్కూళ్లలో చదువుతున్నారు. విజేతలను విశాఖపట్నం ఎస్‌జీఎఫ్ కార్యదర్శి వీపీ పుష్పలత, పీడీలు చిన్న దేవుళ్లు, నాగేశ్వరరావు, ఏపీ అమెచ్యూర్ తైక్వాండో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఆనంద్, కోచ్ జగదీష్ అభినందించారు.

### ఉపాధిని దెబ్బ తీయొద్దు



వుడా కాలనీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న చిల్లర వ్యాపారులు

**మధురవాడ:** జీవీఎంసీ అధికారులు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా బడ్డీలు, దుకాణాలు తొలగించి తమ కుటుంబాలను రోడ్డుకు ఈడ్చేశారని పలువురు చిల్లర దుకాణాలు, బడ్డీల వ్యాపారులు వాపోయారు. ఆదివారం జీవీఎంసీ 8వ వార్డు మధురవాడ మిథిలాపురి వుడా కాలనీ రోడ్డులో గాంధీ విగ్రహం వద్ద బాధితులు నిరసన తెలిపారు. ఏరకమైన ఆధారం లేని తమకు షాపులు నిర్మాణం చేసి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీహెచ్ నాగరాజు, ఎంవీ రమణ మూర్తి, పలువురు బాధితులు పాల్గొన్నారు.

---

> ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు ఉన్న చోట విద్యార్థులు, విద్యార్థులు ఉన్నచోట వసతులు కనిపించడం లేదు. వీటి బలోపేతానికి విద్యాశాఖ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ఉపాధ్యాయ పోస్టులు తగ్గిపోవడం, పాఠశాలలు మూతపడటం వంటివి ప్రతిచోటా చోటు చేసుకుంటున్నాయి.
> – తగరపువలస

### మూతపడిన పల్లిపేట పాఠశాల

పెద్దిపాలెం పంచాయతీలోనే ఉన్న పల్లిపేటలో రెండు తరగతి గదులు ఉన్నా విద్యార్థులు లేక పాఠశాల మూతపడగా ప్రస్తుతం స్థానికులు లైటింగ్ సామగ్రి భద్రపరచుకుంటున్నారు. ప్రభుత్వాలు ఇచ్చే సంక్షేమ పథకాలకు ఆశపడేవారు కూడా తమ పిల్లలను శిక్షణ పొందిన ఉపాధ్యాయులు ఉన్న ప్రభుత్వ పాఠశాలలకు పంపించడానికి ఆలోచిస్తున్నారు. దీంతో ఇలాంటి మారుమూల గ్రామాలకు కూడా ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలకు చెందిన 20 బస్సుల వరకు వచ్చి విద్యార్థులను ఎగరేసుకుపోయి పరోక్షంగా ప్రభుత్వ విద్యాసంస్థలను దెబ్బతీస్తున్నాయి.



మూతపడిన పల్లిపేట ప్రాథమిక పాఠశాల

# ఇక్కడ ఇలా.. అక్కడ అలా..

**రెండు గదులు.. ఏడు తరగతులు**

- ఒక గదిలో ఐదు తరగతులు
- మరో గదిలో రెండు తరగతులు
- పిచ్చుకగూడును తలపిస్తున్న బంటుపల్లి కళ్లాల పాఠశాల

ఆనందపురం మండలం బంటుపల్లి కళ్లాల పంచాయతీలోని మండల ప్రజాపరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను చూస్తే పిచ్చుకల గూడే నయమనిపిస్తుంది. 34 ఏళ్ల క్రితం ఈ గ్రామం వేములవలస పంచాయతీలో ఉండేది. అప్పట్లో ఆపరేషన్ బ్లాక్ బోర్డు పథకం కింద ప్రాథమిక పాఠశాలకు భవనం నిర్మించి ప్రారంభించారు. చుట్టుపక్కల గ్రామాలకు చెందిన వందలాది మంది విద్యార్థులు ఇక్కడే చదువుకుని ఉన్నత స్థానాలను అధిరోహించారు. ఈ భవనం చాలకపోవడంతో 2008లో పక్కనే మరో భవనం నిర్మించి ప్రాథమికోన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేశారు. ప్రస్తుతం పాత భవనం శిథిలం కావడంతో దానిని వినియోగించడం మానివేసి, ఇటీవల కొత్త భవనంపై మరో గదిని నిర్మించారు. ప్రస్తుతం ఇరుకైన రెండు గదులలో ఏడు తరగతులు, 30 మంది విద్యార్థులు, నలుగురు ఉపాధ్యాయులతో నెట్టుకొస్తున్నారు. వీరిలో తరగతుల వారీగా వరుసగా పరిశీలిస్తే 1వ తరగతిలో ముగ్గురు విద్యార్థులు, 2వ తరగతిలో నలుగురు, 3వ తరగతిలో ముగ్గురు, 4వ తరగతిలో నలుగురు, 5వ తరగతిలో ఇద్దరు, 6వ తరగతిలో 5గురు, 7వ తరగతిలో 9 మంది విద్యార్థులు ఉన్నారు. వీరిలో 13 మంది బాలురు, 17మంది బాలికలు ఉన్నారు. ఉపాధ్యాయులలో ఇద్దరు పురుషులు, ఇద్దరు మహిళలు. 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు గ్రౌండ్‌ఫ్లోర్‌లోని ఒక గదిలో ఇద్దరు ఉపాధ్యాయులు, 6 నుంచి 7 తరగతులు ఫస్ట్ ఫ్లోర్‌లో ఇద్దరు ఉపాధ్యాయినులు తరగతులు నిర్వహిస్తున్నారు.



గ్రౌండ్ ఫ్లోర్ గదిలో ఇద్దరు ఉపాధ్యాయులు, 1 నుంచి 5 తరగతుల విద్యార్థులు



పై ఫ్లోర్‌లోని గదిలో ఇద్దరు ఉపాధ్యాయినులు 6,7 తరగతుల విద్యార్థులు

**మిగిలిన వసతులు శూన్యం**

పాఠశాల పక్కనే పెద్ద డ్రైనేజీ నిర్మాణం జరుగుతోంది. వర్షం కురిసే సమయంలో ఇది నిండుగా ప్రవహించడం వలన విద్యార్థులు దీనిని దాటుకు రావడం అత్యంత సాహసంతో కూడుకున్న పని. వాష్‌రూమ్ ఒకటే ఉండటంతో బాలికలు, ఉపాధ్యాయినులు దీనిని వినియోగిస్తుండగా బాలురు, ఉపాధ్యాయులు ఆరుబయటకు వెళ్తుంటారు. ఇంతకు మించి అంగుళం స్థలం కూడా లేకపోవడంతో తరగతి గదుల నుంచి బయటకు అడుగుతీసి రాలేకపోతున్నారు. ఆటస్థలం ఊసే లేదు. పక్కనే శిథిలమైన తరగతి గదులు తొలగించి, కొత్తగా భవనం నిర్మించాలని ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు. 2022 వరకు వందకు పైగా విద్యార్థులు ఉన్న ఈ పాఠశాలలో వసతులు లేకపోవడం వల్లనే పంచాయతీ నుంచి విద్యార్థులు బయటకు వెళ్లిపోతున్నారని ఉపాధ్యాయులు అంటున్నారు.



బంటుపల్లి కళ్లాల్లో 60 గజాల విస్తీర్ణంలో రెండు ఫ్లోర్ల పాఠశాల భవనం

### వసతులున్నా ఐదుగురు విద్యార్థులే..



నలుగురు పిల్లలే హాజరైన మచ్చవానిపాలెం ప్రాథమిక పాఠశాల

బంటుపల్లి కళ్లాల పంచాయతీని ఆనుకుని ఉన్న పెద్దిపాలెం పంచాయతీలోని మచ్చవానిపాలెం ప్రాథమిక పాఠశాల ఉంది. దీనికి విశాలమైన తరగతి గది, టాయిలెట్లు, హాలు ఉంది, కానీ ఒక ఉపాధ్యాయిని, 1వ తరగతిలో ఇద్దరు, 3వ తరగతిలో ఒక్కరు, 5వ తరగతిలో ఇద్దరు విద్యార్థులు ఉన్నారు. ఈ పాఠశాలకు ఎదురుగా ఉన్న విశాలమైన అంగన్‌వాడీ కేంద్రం భవనంలో ఇద్దరు చిన్నారులు, ఒక అంగన్‌వాడీ కార్యకర్త, ఒక ఆయా ఉన్నారు. చిన్నారులను పంపించాలని ఉపాధ్యాయులు మొత్తుకుంటున్నా తమ చిన్నారులను అంగన్‌వాడీలకు కూడా పంపించకుండా తల్లిదండ్రులు కార్పొరేట్ పాఠశాలలకు పంపిస్తున్నారు. గతంలో మచ్చవానిపాలెం ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ చిన్నారులతో కళకళలాడేవే.



ఇద్దరే చిన్నారులు ఉన్న మచ్చవానిపాలెం అంగన్‌వాడీ కేంద్రం

---

## చిరు వ్యాపారుల పోరాటానికి సంఘీభావం

**మధురవాడ:** నగరంలో చిల్లర వ్యాపారులు, వీధి వ్యాపారులకు ముందస్తు సమాచారం లేకుండా జీవీఎంసీ చేపడుతున్న తొలగింపులు తక్షణమే ఆపాలని పలు పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. మధురవాడ సీపీఐ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు మరుపిళ్ల పైడిరాజు అధ్యక్షతన సీపీఐ, సీపీఎం, వైఎస్సార్‌సీపీ, పలు ప్రజా సంఘాలతో ఆదివారం నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో చిరు వ్యాపారుల పోరాటానికి సంఘీభావం ప్రకటించారు. ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ కుటుంబాలను పోషించుకునేందుకు చిల్లర వ్యాపారులు తోపుడుబండ్లు, రోడ్డు పక్కన దుకాణాల్లో చిరు వ్యాపారాలు చేసుకుంటున్నారన్నారు. వీరందరికీ జీవీఎంసీ జోన్ల వారీగా కమిటీలు వేసిందని, వ్యాపారాల కోసం కేంద్రప్రభుత్వం ముద్ర లోన్‌లు ఇచ్చిందని తెలిపారు. జీవీఎంసీ గుర్తింపు కార్డులు ఇచ్చి, చాలా మందికి ట్రేడ్ లైసెన్స్‌లు కూడా ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. వీరి నుంచి ఆశీలు, ఇతర పన్నులు కూడా వసూలు చేస్తున్నారన్నారు. ఇప్పుడు అకస్మాత్తుగా జీవీఎంసీ అధికారులు పోలీసుల సహకారంతో ఆక్రమణల పేరుతో వారి బడ్డీలు, దుకాణాలు తొలగిస్తూ బెదిరింపులకు దిగడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. మధురవాడలో నిత్యం ట్రాఫిక్ సమస్యకు కారణం అవుతున్న డీ మార్టుపై చర్యలు తీసుకోగల సత్తా ప్రభుత్వానికి ఉందా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకుడు డి.అప్పలరాజు, వైఎస్సార్‌సీపీ 7వ వార్డు అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు, సీపీఐ నాయకుడు వి.సత్యనారాయణ, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎం.మన్మథరావు, సీఐటియూ జిల్లా నాయకుడు పి.రాజ్‌కుమార్, ఐద్వా నాయకురాలు పి.వరలక్ష్మి, ఏపీ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ బేగం తదితరులు పాల్గొన్నారు.



చిరు వ్యాపారులకు సంఘీభావం తెలుపుతున్న వివిధ పార్టీల నాయకులు

## స్వచ్ఛందంగా బడ్డీల తరలింపు

**డ్రైవ్‌కు ముందే జాగ్రత్త పడ్డ వ్యాపారులు**

**భీమునిపట్నం:** నగరంలో ఫుట్‌పాత్‌లు, రోడ్లపై ఉన్న దుకాణాల తొలగింపు నేపథ్యంలో భీమిలి బీచ్ వద్ద వ్యాపారులు ముందే జాగ్రత్త పడ్డారు. జెడ్సీ హెచ్చరికల నేపథ్యంలో భీమిలి బీచ్ వద్ద ఫుట్‌పాత్ వైపు ఉన్న బడ్డీలు, తోపుడు బళ్లను డ్రైవ్‌కు ముందే వ్యాపారులు స్వచ్ఛందంగా తరలించారు. ఇక్కడ ఎప్పటి నుంచో రోడ్డుకు ఒకవైపున తినుబండారాల తోపుడు బళ్లు ఉన్నాయి. మరో వైపు ఫుట్‌పాత్ ఉండగా, అటువైపు సందర్శకులు తమ వాహనాలను నిలుపుకొనేవారు. దీనివల్ల ఎవరికీ ఇబ్బంది ఉండేది కాదు. కానీ, గత ఆరు నెలల్లో వాహనాలు నిలిపే ఫుట్‌పాత్ కింద ప్రాంతంలో ఎటువంటి అనుమతులు లేకుండా బడ్డీలు, తోపుడు బళ్లు వచ్చేశాయి. పైగా.. రెండు, మూడు రోజుల వ్యవధిలో కొత్తవి వెలుస్తున్నాయి. దీంతో వాహనాలు నిలిపే అవకాశం కూడా ఉండటం లేదు. వాటికి తోడు కబాబ్‌లు, నూడుల్స్‌తో పాటు ఇతర తినుబండారాల తయారీ వల్ల పొగ విపరీతంగా వస్తుండడంతో బీచ్‌కు వచ్చే సందర్శకులు ఇబ్బంది పడేవారు. వీటి ఏర్పాటులో కొందరు రాజకీయ నాయకుల ప్రమేయం ఉందన్న ఆరోపణలూ ఉండగా.. అధికారులు కూడా దీని గురించి పెద్దగా పట్టించుకోలేదు.




దుకాణాలను తరలించడంతో ఖాళీగా ఉన్న ఫుట్‌పాత్ కింద ప్రాంతం

**అవతలివైపునకు తరలింపు**

ఇదిలా ఉండగా.. ఆరోపణలు తీవ్రమవడంతో ఇటీవల జోనల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు నిర్వాహకులను పిలిచి మాట్లాడారు. బడ్డీలు, తోపుడు బళ్లు ఫుట్‌పాత్ వైపు ఉండరాదని, రోడ్డుకు అటువైపు మాత్రమే ఉంచాలని తెలిపారు. లేకపోతే వెంటనే తొలగిస్తామని హెచ్చరించారు. దీనిపై స్పందించిన నిర్వాహకులు అన్నింటినీ రోడ్డుకు అటువైపు మార్చుకున్నారు. దీంతో ఈ ప్రాంతంలో వాహనాలు నిలపడానికి ఇబ్బంది లేకుండా ఉంది. సందర్శకులు సేద తీరేందుకూ బాగుంది. మళ్లీ వ్యాపారులెవరూ ఫుట్‌పాత్ వైపు రాకుండా అధికారులు చూడాలని సందర్శకులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## బంద్ విజయవంతానికి ప్రచార జాతా

**మధురవాడ:** చిరు వ్యాపారుల దుకాణాలను తొలగించి, వారి కుటుంబాలను రోడ్డు పాల్జేయడం అన్యాయమని పలువురు నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొమ్మాది జంక్షన్ వద్ద సీఐటీయూ అనుబంధ చిల్లర వ్యాపారులు, తోపుడు బండ్ల సంఘం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించనున్న బంద్ విజయవంతానికి ప్రచారజాతా నిర్వహించారు. సీఐటీయూ నాయకుడు డి.అప్పలరాజు మాట్లాడుతూ చిల్లర వర్తకులకు ప్రభుత్వం అన్యాయం చేసిందన్నారు. వీరి పోరాటానికి మద్దతుగా సోమవారం మధురవాడలో బంద్ నిర్వహించి, జీవీఎంసీ ప్రధాన కార్యాలయం ముట్టడికి తరలి వెళ్తున్నట్టు చెప్పారు. సీఐటీయూ విశాఖ జిల్లా నాయకుడు పి.రాజ్‌కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పేదల బతుకులను మరింత దిగజార్చేందుకు కంకణం కట్టుకుందన్నారు.



కొమ్మాది జంక్షన్‌లో ప్రచార జాతాను ప్రారంభిస్తున్న నాయకులు

**విస్తృత ప్రచారం:** బంద్, చలో జీవీఎంసీ ఆఫీసు కార్యక్రమం విజయవంతానికి మధురవాడ, కొమ్మాది, శివశక్తినగర్, పీఎంపాలెం, కార్‌షెడ్, మిథిలాపురి ఉడా కాలనీ, మారికవలస తదితర ప్రాంతాలలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. చిల్లర వర్తకులు, తోపుడుబండ్ల యూనియన్ నాయకులు కె. సురేష్, పి. అజయ్, జి. గోపి, కే శ్రీలక్ష్మి, శైలభాను, ఎన్. నవీన్, వరలక్ష్మి పాల్గొన్నారు.

## 80 మందికి హోమియో మందుల పంపిణీ

**భీమునిపట్నం:** భీమిలిలోని కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిన్నబజారు సమీపంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యులు టి.జగన్నాథరావు, టి.జె.మోహన్ ఇక్కడికి వచ్చిన 80మంది రోగులను పరీక్షించి, వారికి అవసరమైన మందులను అందించారు. ఫౌండేషన్ చైర్మన్ కలిగొట్ల శ్రీరామ్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఫౌండేషన్ ప్రతినిధులు కె.ఎస్.ఎన్.మూర్తి, కె.చంద్రశేఖరరావు, కె.భానోజీరావు, కె.శ్రీనివాసరావు, సభ్యులు పాల్గొన్నారు.

## అమ్మ పూజకు వేళాయె..

- నేటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు
- ముస్తాబైన ఆలయాలు
- సిద్ధమైన మండపాలు



చంద్రంపాలెం దుర్గాలమ్మ



సంగివలస ఆలయంలో పోలమాంబ అమ్మవారు

**తగరపువలస:** శరన్నవరాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధమైంది. అమ్మవారిని తొమ్మిది రోజుల పాటు వివిధ రూపాలలో అర్చించేందుకు నియోజకవర్గంలో ఆలయాలన్నీ ముస్తాబయ్యాయి. వాడవాడలా మండపాలు సిద్ధం చేశారు. సోమవారం ఉదయం అమ్మవారిని అందులో కొలువుదీర్చి పూజలు చేసేందుకు ఉత్సవ కమిటీలు అన్ని ఏర్పాట్లు చేశారు.

**ముగ్గురమ్మవార్ల ఆలయంలో..**

సంగివలస ముగ్గురు అమ్మవార్ల ఆలయంలో దేవదాయశాఖ ఆధ్వర్యంలో సన్నాహాలు పూర్తి చేశారు. పోలమాంబ, ముత్యమాంబ, మరిడిమాంబ విగ్రహాలకు పెయింటింగ్ వేయడంతో పాటు, ఆలయాలను విద్యుద్దీపాలతో అలంకరించారు.

- బైపాస్ రోడ్డులోని విజయదుర్గ ఆలయంలో ట్రస్టీ రాజగిరి కుసుమహర ఆధ్వర్యంలో 10 రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఆలయంలో రోజూ ప్రత్యేక పూజలు, అన్నసమారాధనలు నిర్వహించనున్నారు.
- కొండపేట దుర్గాంబికా ఆలయం, గ్రామదేవతల ఆలయాలు ఉత్సవాలకు ముస్తాబయ్యాయి.



చిట్టివలస కార్మికవాడలో నీళ్ల ట్యాంకు వద్ద మండపం

**ఆకట్టుకుంటున్న మండపాలు**

చిట్టివలసలో గణేష్ థియేటర్ కూడలి, బంతాట మైదానం, నీళ్ల ట్యాంకు, వాణీ స్కూల్, జ్యూట్‌మిల్లు అవుట్ గేట్, తగరపువలస పరిధిలో పలు చోట్ల మండపాలు ఏర్పాటు చేశారు.

**మధురవాడలో..**

**మధురవాడ:** చంద్రంపాలెం జాతరగట్టు దుర్గాలమ్మ టైలర్స్ కాలనీ విజయదుర్గాదేవి ఆలయాలు విశేషంగా ముస్తాబయ్యాయి. సోమవారం నుంచి దుర్గా నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. ప్రత్యేక పూజల కోసం కమిటీని సంప్రదించాలని కోరారు.

**మద్ది సాగరదుర్గ ఆలయంలో..**

**పద్మనాభం:** మండలంలోని మద్దిలో కొలువైన సాగర దుర్గ ఆలయంలో సోమవారం నుంచి వచ్చే నెల రెండో తేదీ వరకు దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. సోమవారం గోపూజ, ఆలయ ప్రవేశం, గణపతి పూజ, పుణ్యాహవచనం వంటి పూజాది కార్యక్రమాలతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని తెలియజేశారు. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు రోజుకో అవతారంలో భక్తులకు దర్శనమిస్తారని పేర్కొన్నారు.



చిట్టివలస వాణీ స్కూల్ వద్ద మండపం



చిట్టివలస బంతాట మైదానంలో మండపం

**విద్యుత్ కాంతుల్లో బబ్బేలమ్మ ఆలయం**

**పీఎం పాలెం:** కారుషెడ్ కూడలి వద్ద బబ్బేలమ్మ ఆలయం దసరా ఉత్సవాలకు ముస్తాబైంది. అమ్మవారి ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి ఆదివారం సాయంత్రం ప్రత్యేక అభిషేకాలు చేశారు. సోమవారం నుంచి అక్టోబర్ రెండో తేదీ వరకు అమ్మవారు ప్రతీరోజు ప్రత్యేక అవతారంలో భక్తులకు దర్శనమిస్తారు. ఆలయ మండపంలో ఉదయం, సాయంత్రం సామూహిక కుంకుమార్చనలు, లలితా సహస్రనామ పారాయణం ఉంటుందని ఆలయ కమిటీ తెలియజేసింది.

**శృంగేరీ శంకర మఠం వద్ద...**

స్థానిక ఆఖరు బస్టాపునకు చేరువలో ఉన్న శ్రీ శృంగేరీ శంకర మఠం వద్ద శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు మఠం గౌరవ పాలనా ప్రతినిధి జగర్లపూడి వెంకటేశ్వర్లు తెలిపారు.

## పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటుదాం



అన్నవరం పరిసరాలలో మొక్కలు నాటుతున్న దివీస్ ఉద్యోగులు

**తగరపువలస:** పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలని దివీస్ లేబొరేటరీ డైరెక్టర్ ఎస్.దేవేందరరావు అన్నారు. సంస్థ వైస్ ప్రెసిడెంట్ ఎల్‌వీ రమణతో కలిసి భీమిలి మండలం అన్నవరం తీరం నుంచి రుషికొండ వరకు ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో ఆదివారం వేలాది మొక్కలు నాటారు. జీఎం కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## జ్యూట్ కార్మికుల సమస్యలు పూర్తిగా పరిష్కరించాలి

**తగరపువలస:** చిట్టివలస జ్యూట్‌మిల్లు కార్మికుల సమస్యలు పూర్తిగా పరిష్కరించాలని గుర్తింపు సంఘం ఇంటక్ అధ్యక్షుడు కాకర్లపూడి వరహాలరాజు మిల్లు యాజమాన్య ప్రతినిధి లలిత్‌మోహన్‌ను కోరారు. మిల్లు ఆవరణలోని లేబర్ ఆఫీస్‌లో ఇంటక్ ఆఫీసు బేరర్లతో ఆదివారం ఆయన సమావేశమయ్యారు. 2009లో లాకౌట్ తరువాత మిల్లు యాజమాన్యం రూ.150 కోట్లకు పైగా ఆస్తులు విక్రయించుకుని కేవలం రూ.36.25 కోట్లు మాత్రమే కార్మికులకు చెల్లింపులు చేసిందన్నారు. మారుపేరు కార్మికుల సమస్యలకు త్వరలో పరిష్కారం దొరుకుతుందన్నారు. లాకౌట్ బాధిత కార్మికుల సంఘం తరపున 157 మంది కార్మికుల సమస్య ఏసీఎల్ పరిధిలో ఉందన్నారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సమక్షంలో జాయింట్ లేబర్ కమిషనర్‌తో త్వరలో చర్చలు జరిపి కార్మికులకు బకాయిలతో సహా పూర్తి పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో గుర్తింపు సంఘం నాయకులు చిల్ల వెంకటరమణ, జీరు వెంకటరెడ్డి, కొయ్య సూరి గురువులు, సరగడ శ్రీరామమూర్తి, పల్ల అప్పారావు, బొడ్డు నరసింగరావు, కొయ్య అప్పలచిట్టి, పోలిపల్లి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇంటక్ అధ్యక్షుడు వరహాలరాజు

## దుకాణాల తొలగింపులో అధికారుల ద్వంద్వ వైఖరి



బింగి హరికిరణ్‌రెడ్డి

**తగరపువలస:** లంగ్స్ 2.0 పేరుతో జీవీఎంసీ అధికారులు నాలుగు రోజులుగా తొలగిస్తున్న దుకాణాల విషయంలో ద్వంద్వ వైఖరి ప్రదర్శిస్తున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి బింగి హరికిరణ్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన సంగివలసలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వ హయాంలో పేదలకు ఒక రూల్ పెద్దలకు ఒక రూల్ నడుస్తోందన్నారు. సామానులు సర్దుకునే అవకాశం ఇవ్వకుండా పేదల గుడిసెలు, దుకాణాలపైనే అధికారులు యంత్రాలతో విరుచుకు పడుతున్నారన్నారు. పెద్ద వ్యాపార సంస్థల నిర్మాణాల జోలికి మాత్రం వెళ్లకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. మధురవాడ, చిట్టివలసల్లో 114 దుకాణాలు ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా డ్రైనేజీల అవతలే ఉన్నాయన్నారు. రూ.లక్షలు అప్పుచేసి పెట్టుబడులు పెట్టుకున్న వ్యాపారులకు విజయదశమి ముందు దిక్కు తోచడం లేదన్నారు. వ్యాపారాలు సాగక, అప్పులు తీరక, వడ్డీలు కట్టలేక ఆత్మహత్యలు చేసుకుంటే ఎవరు బాధ్యత వహిస్తారన్నారు. ఇలాంటి కష్ట సమయంలో క్రేన్ ఆపరేటర్లు బడ్డీలు తొలగించి వేలాది రూపాయలు బాధితుల నుంచి డిమాండ్ చేస్తున్నారని, కూటమి అవినీతి పాలనకు ఇది మచ్చు తునక అన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు హిట్లర్ పాలనకు ఈ సంఘటనలే ఉదాహరణలన్నారు. పేదల జీవనోపాధి ఉసురు తీసిన కూటమి ప్రభుత్వం నామరూపాలు లేకుండా పోతుందని హెచ్చరించారు.